ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 17 మే 2024

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం | 39.0 26.0

పుష్ప వికాసం



ఏడాదికొ ఒక్కసారి.. అదీ మే నెలలో వికసించే 'మే పుష్పం' గుంతకల్లు పట్టణంలోని బెంచికొట్టాలలో కనువిందు చేస్తోంది. రైల్వే ఉద్యోగి సత్యవిజయరాజు, మేరి దంపతుల ఇంట్లో బుధవారం రాత్రి ఈ పువ్వు వికసించింది. ఈ పుష్పాన్ని చూసేందుకు ఇరుగూపొరుగు ఆసక్తి కనబరుస్తున్నారని, ఫొటోలు, సెల్ఫీలు తీసుకుని స్టేటస్‌గా పెట్టుకుంటున్నారని దంపతులు హర్షం వ్యక్తం చేశారు. - గుంతకల్లు టౌన్



తాడిపత్రి డీఎస్పీ గంగయ్య



సీఐ మురళీకృష్ణ

- డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ కూడా..
- తాడిపత్రి అల్లర్లను అరికట్టడంలో విఫలం
- చర్యలు తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం



ఎస్పీ సస్పెన్షన్

అనంతపురం క్రైం, మే 16: తాడిపత్రి అల్లర్లను అరికట్టడంలో విఫలమైనందుకు ఎస్పీ అమిత్ బర్దర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. తాడిపత్రి నియోజకవర్గ కేంద్రంలో పోలింగ్ రోజు, ఆ తరువాత జరిగిన హింసాత్మక చర్యలను అరికట్టడంలో విఫలమైనందుకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది. ఆయనతోపాటు తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య, సీఐ ఎస్.మురళీకృష్ణను సస్పెండ్ చేసింది. తాడిపత్రిలో టీడీపీ, వైసీపీ వర్గీయులు పోలింగ్ రోజున పరస్పరం రాళ్ల దాడులు చేసుకున్నారు. వైసీపీ వర్గీయులు టీడీపీ నాయకుల ఇళ్లపై దాడులు చేశారు. మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. టీడీపీ నాయకుడు సూర్యముని ఇంటిపై సైతం దాడి చేశారు. మరోవైపు జేసీ ప్రభాకర్ రెడ్డి కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ దాసరి కిరణ్‌ను డీఎస్పీ చైతన్య ఆదేశాలతో పోలీసులు విచక్షణా రహితంగా కొట్టారు. తీవ్రంగా గాయపడ్డ బాధితులు ఆస్పత్రిపాలయ్యాడు. ఈ ఘటనలపై కేంద్ర ఎన్నికల కమిషన్ సీరియస్ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, డీజీపీని ఢిల్లీకి పిలిపించి మాట్లాడింది. సీఈసీ ఆదేశాల మేరకు ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణపై సస్పెన్షన్ వేటు వేశారు. వీరిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు.

డీఎస్పీ చైతన్య రౌడీయిజం..



తాడిపత్రి డీఎస్పీగా పనిచేసిన చైతన్య.. వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. టీడీపీ నాయకుల పట్ల అణచివేత ధోరణి అవలంభించారు. ఇదే కారణాలతో ఆయనను గతంలో కడప జిల్లా రాజంపేటకు బదిలీ చేశారు. అలాంటి అధికారిని ఎన్నికల గొడవల సమయంలో తాడిపత్రికి తీసుకువచ్చారు. అల్లర్లను నియంత్రించే పేరిట వచ్చిన డీఎస్పీ చైతన్య.. మునుపటి ధోరణిలోనే వ్యవహరించారు. రౌడీలా ప్రవర్తించారు. ఆయన ఆదేశాలతో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంట్లో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ దాసరి కిరణ్‌ను స్పెషల్ పార్టీ పోలీసులు జూనియర్ కాలేజీ మైదానానికి మంగళవారం అర్ధరాత్రి ఈడ్చుకువెళ్లారు. అక్కడ విచక్షణారహితంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన దాసరి కిరణ్.. రక్తపు మడుగులో ఉండగా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాడిపత్రి డీఎస్పీ గంగయ్య సైతం శాంతిభద్రతలను కాపాడే విషయంలో విఫలమయ్యారు. ఎస్పీ బర్దర్ కొత్త కావడంతో కొందరు కిందిస్థాయి అధికారులు సరిగా స్పందించనట్లు తెలుస్తోంది. ఈ గొడవలను సీరియస్‌గా తీసుకున్న ఎన్నికల సంఘం.. అధికారులపై వేటు వేయాలని ఆదేశించింది.

ఎస్పీ నిద్రపోయిందా...?



ఎన్నికల సమయంలో తాడిపత్రిలో ఏ స్థాయిలో గొడవలు జరుగుతాయో తెలియంది కాదు. అలాంటి ప్రాంతంలో హింస చెలరేగుతుందని ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ కొత్తగా వచ్చిన డీఐజీ, ఎస్పీకి ఈ విషయం గురించి స్పెషల్ బ్రాంచ్ చెప్పలేదా..? అన్న చర్చ నడుస్తోంది. పోలింగ్ రోజున గొడవలు మొదలైతే.. మరుసటి రోజు వరకూ నియంత్రించలేకపోవడం విస్మయం కలిగిస్తోంది. డీఎస్పీ చైతన్య గతంలో తాడిపత్రిలో ఎలా వ్యవహరించారో అందరికీ తెలుసు. అలాంటి అధికారిని అల్లర్లు జరిగే సమయంలో తీసుకురావడం మరో తప్పిదం. ఆయన వ్యవహార శైలి గురించి ఎస్పీ, డీఐజీకి చెప్పాల్సిన బాధ్యత స్పెషల్ బ్రాంచి వారిదే. డీఎస్పీ చైతన్యలాంటి అధికారి తాడిపత్రికి వెళితే వివాదాలు సద్దుమణగడం మాని.. కొత్త సమస్యలు తలెత్తుతాయని పోలీసు శాఖలో ఎవరిని అడిగినా చెబుతారు. కానీ ఆయన్నే తాడిపత్రికి పంపించారు.



నిందితులను వాహనాలలో కోర్టుకు తరలిస్తున్న దృశ్యం

91 మంది అరెస్టు.. రిమాండ్

ఉరవకొండ: తాడిపత్రిలో జరిగిన గొడవల కేసులో నిందితులను పోలీసులు ఉరవకొండ కోర్టులో గురువారం హాజరుపరిచారు. వారికి 14 రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి దుర్గా కల్యాణి ఆదేశాలు జారీ చేశారు. తాడిపత్రి సీఐ మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు వైసీపీ, టీడీపీకి చెందిన 91 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో 37 మంది వైసీపీ వర్గీయులు, 54 మంది టీడీపీ వర్గీయులు ఉన్నారు. తాడిపత్రిలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణలను నియంత్రించేందుకు వెళ్లిన సీఐ విధులకు ఆటంకం కలిగించి, హత్య చేసేందుకు ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితులపై ఐపీసీ 147, 148, 427, 307, 332, 353 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తాడిపత్రి నుంచి వారిని ఉరవకొండకు తీసుకొస్తున్న నేపథ్యంలో కోర్టు వద్ద భారీ పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ఆంక్షలు విధించారు. అక్కడ ఉన్నవారిని చెదరగొట్టారు. ట్రాఫిక్ మళ్లించారు. ప్రత్యేక వాహనాల్లో తీసుకువచ్చారు. సాయంత్రం 4 గంటలకు కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల రెడ్డిపల్లి జైళ్లకు తరలించాలని భావించారు. కానీ భద్రతా కారణాల దృష్ట్యా జైలు అధికారులు అంగీకరించలేదు. దీంతో అందరినీ రాత్రి కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

ఇక్కడ ఉండొద్దు!

- జేసీ కుటుంబంపై పోలీసుల ఆంక్షలు
- అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీ జేసీ
- చూసేందుకు వచ్చిన జేసీ పవన్‌రెడ్డి హౌస్ అరెస్ట్
- ఆపై బలవంతంగా హైదరాబాదుకు తరలింపు

మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి కుటుంబంపై పోలీసులు కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన జేసీ దివాకర్ రెడ్డిని, ఆయన సతీమణి విజయమ్మ, సోదరి సుజాతను సైతం ఊరు విడిచి వెళ్లాలని హెచ్చరించారు. బలవంతంగా వారిని హైదరాబాదుకు తరలించారు. ఎన్నికల గొడవల నేపథ్యంలో ఇప్పటికే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ కూటమి అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డిని పోలీసులు హైదరాబాద్‌కు తరలించారు. వారి ఇళ్లలో పనిమనుషులను కూడా అదుపులోకి తీసుకున్నారు. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న జేసీ, ఆయన సతీమణి, సోదరి, జేసీ ప్రభాకర్‌రెడ్డి సతీమణి ఉమారెడ్డి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న జేసీ తనయుడు పవన్ రెడ్డి హైదారాబాదు నుంచి గురువారం ఉదయం తాడిపత్రికి చేరుకున్నారు. అక్కడ కాపలాగా ఉన్న పోలీసులు ఆయనను ఇంట్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. తన తల్లిదండ్రుల ఆరోగ్యం సరిగా, లేదని వారిని చూడటానికి వచ్చానని చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు. చాలాసేపు వాదోపవాదాల జరిగాక పవన్‌రెడ్డిని ఇంటిలోకి అనుమతించారు. మధ్యాహ్న సమయంలో హౌస్ అరెస్ట్ చేస్తున్నట్లు నోటీసులు అందించారు. ఆ తరువాత గంటల వ్యవధిలోనే ఊరువిడిచి వెళ్లాలని హెచ్చరికలు జారీచేశారు. హౌస్ అరెస్టులో ఉన్న తాను ఎందుకు ఊరు విడిచివెళ్లాలని ఆయన నిలదీశారు. తాను నడవలేని స్థితిలో ఉన్నానని, తన సోదరి కోమాలో ఉన్నారని జేసీ దివాకర్ రెడ్డి చెప్పినా వారు వినిపించుకోలేదు. దీంతో చేసేది లేక అందరూ పోలీసుల బందోబస్తు మధ్య హైదరాబాద్‌కు తరలివెళ్లారు. వివాదం నేపథ్యంలో జేసీ ఇంటి వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన విలేకరులను పోలీసులు అడ్డుకున్నారు. జేసీ పవన్ రెడ్డి మీడియాతో మాట్లాడాలని భావించినా.. పోలీసులు అనుమతించలేదు.



పోలీసుల బందోబస్తు నడుమ హైదరాబాద్‌కు వెళుతున్న జేసీ కుటుంబ సభ్యులు

భయం గుప్పిట్లో.. తాడిపత్రి

- ఎక్కడ చూసినా పోలీసులే..
- పెద్దారెడ్డి, జేసీపీఆర్ నివాసాల వద్ద దయనీయ పరిస్థితులు
- ఇళ్లకు తాళం వేసుకుని వెళ్లిపోయిన సమీప ప్రాంతాలవారు
- వెంటాడుతున్న కేసుల భయం..
- అజ్ఞాతంలోకి నాయకులు
- చిరు వ్యాపారులు, కార్మికులకు తీవ్ర ఇబ్బందులు



జేసీ ఇంటివద్ద బారికేడ్లు

తాడిపత్రి టౌన్, మే 16: వరుస దాడులు, ప్రతిదాడులతో అనంతపురం జిల్లా తాడిపత్రి ప్రజలు భయం గుప్పిట్లో బతుకున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. పోలింగ్ రోజు మొదలైన హింస ప్రభావం నాలుగు రోజులు గడిచినా కొనసాగుతోంది. పట్టణంలో ఎక్కడచూసినా పోలీసు బలగాలే దర్శనమిస్తున్నాయి. దీంతో సామాన్య ప్రజలు, చిరువ్యాపారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసాల పరిసర ప్రాంతాల్లో ఉండేవారి పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. బయటకు వస్తే ఏం జరుగుతుందోనని మహిళలు, చిన్నారులు ఇళ్ల నుంచి అడుగు బటయపెట్టడం లేదు. మరికొందరు పరిస్థితి సద్దుమణిగాక రావచ్చని భావించి.. ఇళ్లకు తాళం వేసుకుని బంధువుల ఊర్లకు వెళ్లిపోయారు. రాత్రి 9 గంటలు దాటితే అత్యవసరమైతే తప్ప ఏ ఒక్కరూ బయటకు రావడం లేదు. బయట కనిపిస్తే చాలు.. 'ఎవరు..? ఎక్కడ..?' అని పోలీసులు ప్రశ్నిస్తున్నారని, వారికి సమాధానం చెప్పలేకున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో ఉన్న అల్ట్రాటెక్, స్టీల్ ఫ్యాక్టరీ, సాగర్‌సిమెంట్, పెన్నాసిమెంట్, రామ్‌కో సిమెంట్ పరిశ్రమల్లో పనిచేసేవారు రాత్రి విధులు ముగించుకొని తిరిగి వచ్చేందుకు జంకుతున్నారు. తహసీల్దారు కార్యాలయం సమీపంలో పోలీసులు అడ్డుకుని, ఈ సమయంలో ఎక్కడి నుంచి వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. గుర్తింపు కార్డులు చూపించినా లాఠీ దెబ్బలు తప్పడం లేదని అంటున్నారు.

అజ్ఞాతంలోకి..

రెండు పార్టీల్లో గొడవల్లో ఎవరెవరు పాల్గొన్నారోగాని.. సంబంధమే లేని వ్యక్తులు పారిపోవాల్సి వస్తోంది. రాజకీయ నేపథ్యం ఉన్న ప్రతి ఒక్కరూ అజ్ఞాతంలోకి వెళుతున్నారు. తాడిపత్రి పట్టణంలోని వైసీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పోలీసు కేసుల భయం పట్టుకుంది. రెండురోజులుగా కేంద్రబలగాలు పట్టణంలో నాయకుల ఇళ్లవద్దకు వెళ్లి ఆరాతీస్తున్నాయి. చుట్టుపక్క మండలాలలోనూ తనిఖీలు పెంచారు. దీంతో ఎవరికివారు బ్యాగులు సర్దుకొని అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు గొడవల్లో పాల్గొన్నవారిని గుర్తిస్తున్నారు. వరుసగా అరెస్ట్ చేస్తున్నారు. దీంతో నాయకుల్లో వణుకుపుడుతోంది. పోలీసుల కంటపడకుండా తోటలు, కొండల్లో తలదాచుకుంటున్నారు. వారికి మూడు పూటలా భోజనం సమకూర్చలేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రబోధానంద ఆశ్రమం వద్ద జరిగిన గొడవలకు సంబంధించిన కేసులో వందల సంఖ్యలో నిందితులను చేర్చారు. కేసులు నమోదుచేసి జైలుకు పంపించారు. ఈ కేసు ఇప్పటికీ నడుస్తోంది. దీంతో తాజా గొడవల్లో తమ పేరు ఎక్కడ చేరుస్తారోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.

వ్యాపారులకు చిక్కులు

తాడిపత్రి పట్టణానికి చుట్టుపక్కల గ్రామాలు, పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు, యాడికి మండలాల రైతులు, చిరువ్యాపారులు ప్రతిరోజూ వస్తుంటారు. నిత్యావసరాలు, పరికరాలు, మందులు కొనుగోలు చేస్తుంటారు. వ్యవసాయ దిగుబడులను మార్కెట్‌కు తెచ్చేవారూ ఉంటారు. పోలీసుల ఆంక్షలతో వీరందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణానికి రావాలంటే చెక్‌పోస్టు వద్ద తమ గుర్తింపుకార్డులను చూపించాల్సి వస్తోందని అంటున్నారు. గుర్తింపుకార్డులు లేనివారి పోలీసులు వెనక్కి పంపుతున్నారు.

91 మందిపై 307 కేసు నమోదు

తాడిపత్రి గొడవలకు సంబంధించి పోలీసులు ఇప్పటివరకు 91 మందిపై ఐపీసీ సెక్షన్ 307 కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. వారిని గురువారం ఉరవకొండ కోర్టులో హాజరుపరిచారు. నిందితుల్లో టీడీపీకి చెందిన 54 మంది, వైసీపీకి చెందిన 37 మంది ఉన్నారు. అరెస్టు అయిన వారిలో టీడీపీకి చెందిన మల్లికార్జునరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, వైసీపీకి చెందిన బొంబాయి రమేష్‌నాయుడు, బాలా రమేష్‌బాబు, కంచం రాంమోహన్‌రెడ్డి, జావిద్ ఖాద్రీ, నాగభూషణం తదితరులు ఉన్నారు.



భగత్‌సింగ్ నగర్ వాసులను అడ్డుకుంటున్న పోలీసులు

పందెమా.. వద్దులేప్పా..!

కూటమిదే అధికారమట..

- డబ్బులెందుకు పోగొట్టుకోవాలి..
- వైసీపీపై బెట్టింగ్‌కు జంకుతున్న పందెంరాయుళ్లు
- వైసీపీ అభ్యర్థుల్లో కనిపించని మునుపటి జోష్



అనంతపురం, మే 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ అభ్యర్థుల్లో రోజురోజుకూ అభద్రతాభావం పెరిగిపోతోంది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ముందు ఉన్న జోష్ వారిలో కనిపించడం లేదు. ఈ ఎన్నికల్లో గెలుస్తామా లేదా అనే గుబులు పట్టుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో వైసీపీ అభ్యర్థుల గెలుపుపై పందెం కాసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. పోలింగ్ శాతం పెరగడం.. యువత ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనడం వైసీపీ అభ్యర్థులను, శ్రేణులను నిరుత్సాహానికి గురిచేస్తోంది. ప్రభుత్వంపై ఉద్యోగవర్గాల్లో ఉన్న వ్యతిరేకత, అధికారంలో ఉన్నామనే దర్పంతో ఎమ్మెల్యేలు సాగించిన అక్రమాలు, దౌర్జన్యాలు వైసీపీని వెంటాడుతున్నాయి. బటన్ నొక్కుడు తప్ప ఐదేళ్లలో కరువు జిల్లా అభివృద్ధి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఆ ప్రభావం ఓటింగ్‌పై పడిందన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎక్కడా చూసినా కూటమిదే అధికారమనే చర్చ జోరుగా సాగుతోంది. దీంతో వైసీపీ అభ్యర్థుల గెలుపుపైగాని, వైసీపీదే అధికారమనే అంశంపైగాని బెట్టింగ్ కాసేందుకు పందెంరాయుళ్లు జంకుతున్నారు. 'వైసీపీపై పందెమా... వద్దులేప్పా..' అంటున్నారు. కూటమిదే అధికారమట.. డబ్బులెందుకు పోగొట్టుకోవాలి అని జంకుతున్నారని సమాచారం.

కనిపించని ఉత్సాహం...

గత సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు గెలుపొందుతారని, రాష్ట్రంలో వైసీపీదే అధికారమని భారీగా పందేలు కాశారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపుపై రూ.కోట్లలో బెట్టింగ్ కట్టారు. అనంతపురం నగరంలోని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రాప్తాడు అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మెజార్టీపైనే రూ.కోటి పందెంకాసి గెలుపొందాడు. రామ్‌నగర్‌లో కొందరు వ్యాపారులకు వైసీపీపై బెట్టింగ్ కాసేవారికి సవాల్ విసిరారు. ఎన్ని కోట్లయినా పందేనికి రెడీ అని రెచ్చగొట్టారు. తాడిపత్రిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గత సార్వత్రిక ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా వైసీపీ అభ్యర్థుల గెలుపు, వైసీపీదే అధికారం అనే అంశంపై రూ.200 కోట్ల దాకా పందేలు కాశారు. ఈ ఎన్నికల్లో మునుపటి ఉత్సాహం కనిపించడం లేదని సమాచారం. జిల్లాలోని రాప్తాడు, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, గుంతకల్లు, రాయదుర్గం, ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు గెలుస్తారనిగాని, వైసీపీ మరోమారు అధికారంలోకి వస్తుందనిగాని పందెంకాసేవాళ్లు చాలా తక్కువగా ఉన్నారని అంటున్నారు. గతంలో రూ.కోట్లలో పందెంకాసినవారు రూ.5 లక్షలు, రూ.10 లక్షలతో సరిపెట్టుకుంటున్నారని సమాచారం. రాష్ట్రంలో కూటమిదే అధికారమని గత సార్వత్రిక ఎన్నికల్లో భారీగా పందెంకాసి పోగొట్టుకున్నవారు ఈసారి కాలుదువ్వుతున్నారు. ఎంతైనా సరే అని అంటున్నారు. వైసీపీ అధికారంలోకి రాదని, జిల్లాలో మెజార్టీ స్థానాలు కూటమికే దక్కుతాయని పందెంకాసేందుకు పోటీ పడుతున్నారు.

వైసీపీ అభ్యర్థులు డీలా...



రాష్ట్రంలో కూటమిదే అధికారమని సర్వేలు చెబుతున్నాయి. రాజకీయ విశ్లేషకుల నుంచి ఇదే అభిప్రాయం స్పష్టంగా వెలువడుతోంది. ఇది వైసీపీ అభ్యర్థుల్లో గుబులు పుట్టిస్తోంది. ఆ పార్టీ అభ్యర్థులు రోజురోజుకు డీలా పడుతున్నారు. పోలింగ్ జరిగిన తీరు, ఓటు హక్కును అత్యధికంగా వినియోగించుకున్న వివిధ వర్గాల సంఖ్య, గ్రామాల్లో బూత్‌స్థాయిలో పోలింగ్ జరిగిన తీరు, ఓటర్ల మనోగతం.. ఇవన్నీ అధికార పార్టీకి వ్యతిరేకంగానే కనిపిస్తున్నాయి. వైసీపీ అభ్యర్థులు ప్రతిరోజూ సమీక్షిస్తూ... లెక్కలేసుకుంటున్నా.. వారిలో నమ్మకం కుదరలేదని సమాచారం. గెలుస్తామనే ధీమా వారు వ్యక్తం చేయలేని పరిస్థితిలో ఉన్నారు.

ఓపీలో నరకం





అయ్యో... రామా..



ఓపీ చీటీల కౌంటర్ల వద్ద రద్దీ

- ఒకే చోట స్త్రీపురుషుల కౌంటర్లు
- చీటీల కోసం గంటలు గంటలు



అనంతపురం టౌన్, మే 16: సర్వజన వైద్యశాలలో ఓపీ కౌంటర్ అత్యంత అసౌకర్యంగా మారింది. రోగులు, వారి బంధువులు గంటల తరబడి క్యూలో ఉండాల్సి వస్తోంది. ఓపీ, ఇన్‌పేషెంట్ల అడ్మిషన్ కౌంటర్లు ఒకేచోట ఏర్పాటు చేయడం, మహిళలు, పురుషులకు కలిపి కౌంటర్లు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యం కోసం వస్తే కొత్త రోగాలు సోకేలా ఉన్నాయని బాధితులు వాపోతున్నారు. జిల్లా ఆస్పత్రిలో ఓపీ చీటీలకు గతంలో మహిళలకు, పురుషులకు వేర్వేరు కౌంటర్లు ఉండేవి. అవి ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ఉండటంతో వైద్యులు, సిబ్బందికి, రోగులకు ఇబ్బందికరంగా ఉన్నాయని భావించారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు, ఇంజినీరింగ్ అధికారులు చర్చించుకుని.. రోగుల విశ్రాంతి గదులను ఆధునికీకరించి ఓపీ కౌంటర్లను అక్కడికి మార్చారు. కానీ మహిళలు, పురుషులు, ఇన్‌పేషెంట్ల అడ్మిషన్ కౌంటర్లు ఒకేచోట ఏర్పాటు చేశారు. రోజుకు 1500 నుంచి రెండు వేలమంది వరకు రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. దీంతో ఓపీ కౌంటర్లు కిటకిటలాడుతున్నాయి. ఎండాకాలం కావడం, రేకుల షెడ్డులో గాలిదూరకుండా మూసివేయడంతో రోగులు అల్లాడిపోతున్నారు. ఓపీ చీటీ కోసం గంట నుంచి రెండు గంటలు వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఓపీ చీటీలకు ఆధార్ అనుసంధానం పెట్టడంతో మరింత జాప్యం జరుగుతోంది.







ఉక్కపోతకు అల్లాడిపోతున్న రోగులు



ఆధార్ లేదని తిప్పుతున్నారు



ఆరోగ్యం బాగాలేదు. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చాను. ఓపీ చీటీ కోసం గంటపాటు క్యూలో ఉన్నారు. తీరా నా వంతు వచ్చాక ఆధార్ లేకుంటే ఇవ్వమని అంటున్నారు. రెండు గంటల నుంచి అటూ ఇటు తిప్పుతున్నారు. - సాదిక

ఉక్కపోతతో అల్లాడిపోతున్నాం



ఓపీ చీటీల కౌంటర్‌లో నరకం చూపిస్తున్నారు. గంటన్నరపాటు లైన్‌లో ఉన్నా ఓపీ చీటీ అందలేదు. పైగా ఉక్కపోతతో అల్లాడిపోతున్నాం. - లక్ష్మీదేవి

ఒకే చోట ఉన్నందుకే సమస్య..



రెండు గంటలుగా క్యూలో ఉన్నా ఓపీ చీటీ దొరకలేదు. రేకులు షెడ్డు కావడంతో ఉక్కుపోతతో అల్లాడిపోతున్నాం. ఒకేచోట కౌంటర్లు పెట్టడం వల్లనే ఈ సమస్య ఏర్పడుతోంది. మరిన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి, అధికారులు సమస్యను పరిష్కరించాలి. - ఈశ్వరమ్మ


పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్యసిబ్బంది

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ నిర్మూలన

● డీఎంహెచ్‌ఓ మంజువాణి

పుట్టపర్తిరూరల్ మే 16: అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయవ్యాధిని శాశ్వతంగా నిర్మూలించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంనుంచి గణేష్‌కూడలి వరకు గురువారం ఆమె వైద్యసిబ్బందితో కలిసి క్షయ నివారణ, డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల క్షయ మళ్లీ రాదన్నారు. శాశ్వతంగా నిర్మూలన అవుతుందన్నారు. ఐదేళ్లుగా టీబీ వచ్చి తగ్గిపోయిన వారు, అరవైఏళ్ల వయసు నిండిన వారు, పొగ తాగేవారు, షుగర్ ఉన్నవారు, ఎత్తుకు తగిన బరువు లేనివారు తప్పకుండా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. అలాగే డెంగీ నివారణకు ప్రజలు పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా డెంగీని అరికట్టవచ్చన్నారు. ప్రతిశుక్రవారం డ్రైడే‌ఫ్రైడే పాటించాలని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. దోమలు కుట్టడం వల్లే డెంగీ, మలేరియా లాంటివి వస్తాయని, కనుక వాటి భారిన పడకుండా దోమ తెరలు వాడాలని, సాయంత్రం సమయంలో ఇళ్ల ముంగిట వేపాక పొగ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ జిల్లా అధికారి డాక్టర్ నాయక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్‌ఎన్ లలితకుమారి, ఎస్‌యూఓ రమణయ్య డీపీసీ మల్లికార్జున, పీపీఎం నాగేంద్ర, డీపీఎస్ ఆంజనేయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ చైతన్యపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ


చికిత్స పొందుతున్న దాసరి కిరణ్‌ను పరామర్శిస్తున్న కాలవ శ్రీనివాసులు, వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, మే 16: జేసీ ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న దాసరి కిరణ్‌పై దాడికి పాల్పడిన డీఎస్పీ చైతన్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి గురువారం ఆయన అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న దాసరి కిరణ్‌ను పరామర్శించారు. ఓడిపోతున్నామన్న అక్కసుతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మూడు రోజులుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. పెద్దారెడ్డి స్వయంగా దాడిలో పాల్గొన్నారని, ఎమ్మెల్యేని సకాలంలో కట్టడి చేయడంలో పోలీసులు విఫలమయ్యారని అన్నారు. గతంలో తాడిపత్రిలో అత్యంత వివాదాస్పదంగా వ్యవహరించిన డీఎస్పీ చైతన్యను రాజంపేట నుంచి తాడిపత్రికి రప్పించడం పైస్థాయిలో జరిగిన కుట్ర అని అన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటిపై డీఎస్పీ చైతన్య ఉద్దేశపూర్వకంగా దాడి చేయించారని, కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్‌ను ఇంటి బయటకు తీసుకువెళ్లి దారుణంగా చితకబాదారని అన్నారు. ఈ ఘటనపై ఇప్పటి దాకా ఎంఎల్‌సీ నమోదు చేయలేదని, బాధితుడి స్టేట్‌మెంట్ కూడా నమోదు చేయలేదని అన్నారు. పోలీసుల పక్షపాత వైఖరికి ఇదే నిదర్శనమని అన్నారు. సీఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి డైరెక్షన్‌లోనే తాడిపత్రి పోలీసులు ఏకపక్షంగా పనిచేస్తున్నారన్నారని ఆరోపించారు. పోలీసులే హింసకు ఒడిగడితే శాంతి భద్రతలను ఎవరు కాపాడతారని ప్రశ్నించారు. దళితుడు, దివ్యాంగుడైన కిరణ్‌ను డీఎస్పీ చైతన్య విచక్షణా రహితంగా కొట్టడం దారుణ మని వెంకటశివుడు యాదవ్ అన్నారు. తాడిపత్రిలో పనిచేసే సమయంలో డీఎస్పీ చైతన్య టీడీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్‌గా చేసుకొని హింసించారని అన్నారు. అందుకే ఆయన్ను ఇక్కడి నుంచి బదిలీ చేశారని అన్నారు. తాడిపత్రిలో గొడవలు జరిగే సమయంలో పోలీసు బలగాల పేరుతో ఆయన్ను రప్పించి, టీడీపీ నాయకులపై దాడులు చేయించడం అప్రజాస్వామికమని అన్నారు. డీఎస్పీ చైతన్య కక్ష్యసాధింపు చర్యలపై విచారణ చేయించి, ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు చేస్తేనే పోలీసు వ్యవస్థపై సామాన్యులకు నమ్మకం కలుగుతుందని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా పోలీసు ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారివెంట టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, నాయకులు గంజే నాగరాజు, లక్ష్మీనరసింహ, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న తదితరులు ఉన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అరెస్టు

అనంతపురం విద్య, మే 16: తాడిపత్రిలో పోలీసులు దాడిలో తీవ్రంగా గాయపడిన కిరణ్‌ను పరామర్శించడానికి వెళ్తున్న సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో ఉన్న దివ్యాంగుడు కిరణ్‌ను పోలీసులు విచక్షణా రహితంగా కొట్టడంతో అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. దీంతో గురువారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిరణ్‌ను పరామర్శించడానికి సీపీఐ జాఫర్, ఇతర నాయకులు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు జాఫర్‌ను ఆయన ఇంటి వద్దే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీపై సందిగ్ధం..!



● సమీపిస్తున్న ఖరీఫ్ సీజన్.. మరో పక్షం రోజులే గడువు
● పోలింగ్ ముగిసినా పట్టించుకోని ప్రభుత్వం
● మొదలైన విత్తన ప్రాసెసింగ్ పనులు
● సబ్సిడీ ధరల ఖరారుపై నిర్లక్ష్యం

అనంతపురం అర్బన్, మే 16: కరువు రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీపై సందిగ్ధం నెలకొంది. ఎన్నికల పోలింగ్ ముగిసి నాలుగు రోజులు కావస్తున్నా... జిల్లాకు విత్తన కేటాయింపు... సబ్సిడీ ధరల ఖరారుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం విస్మయం కలిగిస్తోంది. ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే జిల్లాకు కావాల్సిన విత్తన వేరుశనగ, ఇతర రకాల అంతర పంటల విత్తనాలపై జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రతిపాదనలు పంపించి రెండు మాసాలు గడుస్తున్నా.. ఇప్పటి దాకా అతీగతీ లేకుండా పోయింది. పోలింగ్ తర్వాత విత్తనాల కేటాయింపుతోపాటు సబ్సిడీ ధరలు ఒకే సారి ఖరారు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ ఉన్నతాధికారులు భావించినట్లు తెలుస్తోంది. అయితే ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతుంది. ఇందుకు మరో పక్షం రోజేలే సమయం ఉంది. అయితే ఇప్పటి దాకా జిల్లాకు విత్తన కేటాయింపుతోపాటు సబ్సిడీ ధరలు ఖరారు చేయకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విత్తనాల కేటాయింపు... సబ్సిడీ ధరలపై నిర్లక్ష్యం

జిల్లాకు సబ్సిడీ విత్తనాల కేటాయింపుతో పాటు సబ్సిడీ ధరలు ఖరారు చేయడంపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ ఏడాది మార్చిలోనే ఖరీఫ్ సీజన్‌లో విత్తన వేశనగతోపాటు ఇతర రకాల విత్తనాల కేటాయింపులకు సంబంధించి ప్రతిపాదనలు పంపారు. ఈ సారి జిల్లాకు వేరుశనగ 1.25 లక్షల క్వింటాళ్లు, కంది 2500 క్వింటాళ్లు, గ్రీన్ పచ్చి రెట్ట ఎరువులు 600, కొర్ర 100, పెసలు 100, అలసందలు 150, రాగి 50 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి దాకా జిల్లాకు విత్తనాలు కేటాయించి, సంబంధించిన గైడ్‌లైన్స్‌ను జారీ చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతేడాది జిల్లాకు 78,245 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించారు. ఇందులో 8వేల క్వింటాళ్లు కదిరి లేపాక్షి రకం, మిగతాది కే-6 రకం విత్తన వేరుశనగను కేటాయించారు. ఈ సారి ఎప్పటిలోగా విత్తన కాయలు కేటాయిస్తారు..? ఎప్పటిలోగా ఆర్బీకేలకు విత్తన కాయలు సరఫరా చేసి రైతులకు అందిస్తారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సకాలంలో విత్తన పంపిణీ జరిగేనా..?

గతేడాది మే మొదటి వారంలోగానే విత్తన వేరుశనగతోపాటు ఇతర రకాల విత్తనాల సబ్సిడీ ధలు ఖరారు చేశారు. గత ఏడాది మే 16 నుంచి ఆర్బీకేల్లో రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ మొదలు పెట్టారు. మే 29 నుంచి విత్తన పంపిణీ ఆరంభించారు. ఈ సారి ఇప్పటి దాకా విత్తన పంపిణీకి సంబంధించిన ఎలాంటి గైడ్ లైన్స్ జారీ కాలేదు. సబ్సిడీ విత్తన సరఫరాకు టెండర్లు ఖరారు చేయడంతో జిల్లాలోని ఎనిమిది ప్రాసెసింగ్ యూనిట్లల్లో ఎట్టకేలకు ప్రాసెసింగ్ మొదలుపెట్టారు. ఇప్పటి దాకా తొమ్మిది వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొం టున్నారు. విత్తన వేరుశనగను ప్రాసెసింగ్‌ను మరింత వేగవంతం చేయడంతోపాటు నాణ్యత ప్రమాణాలు పాటించేలా జిల్లా వ్యవసాయ యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకపోతే ఈ సారి సకాలంలో విత్తన పంపిణీ నిర్వహించడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరి ఏ మేరకు అధికారులు చొరవ చూపుతారో వేచిచూడాల్సిందే.

విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ మొదలైంది



జిల్లాకు విత్తన వేరుశనగతో పాటు ఇతర అంతర పంటల విత్తనాలు ఎంత మోతాదులో కావాలన్న దానిపై ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే విత్తన సరఫరా కోసం రాష్ట్ర స్థాయిలో టెండర్లు ఖరారయ్యాయి. జిల్లాలోని ఎనిమిది ప్రాసెసింగ్ యూనిట్లల్లో విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ మొదలు పెట్టాం. ఇప్పటి వరకు తొమ్మిది వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పూర్తైంది. ప్రాసెసింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నాణ్యమైన విత్తన కాయలను రైతులకు పంపిణీ చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. - **ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి**

సచివాలయం ఖాళీ..!

● కనిపించని ఉద్యోగులు
● తలుపులు తెరుస్తున్న వలంటీర్లు
● ఇబ్బందుల్లో లబ్ధిదారులు


గాండ్లపెంట సచివాలయం

గాండ్లపెంట, మే 16: మండలకేంద్రంలోని సచివాలయం ఉద్యోగులు లేక ఖాళీగా దర్శనమిస్తోంది. సమయపాలన పాటించట్లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయంలో వివిధరకాల పదవుల్లో 11 మంది సిబ్బందిని నియమించారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, వన్‌బీలు తదితరాల కోసం నిత్యం జనం సచివాలయానికి వస్తుంటారు. ఉద్యోగులు అందుబాటులో లేకపోతుండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ తలుపులను వలంటీర్లు తెరవాల్సి వస్తోంది. సాయంత్రం వారే మూయాల్సి వస్తోంది. ఉదయం 10 గంటలకే సచివాలయం తెరవాలి. సిబ్బంది మొత్తం హాజరుకావాలి. సచివాలయ ఉద్యోగులు 11 గంటలైనా విధులకు రావట్లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వెళితే సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గురువారం ఉదయం 11 గంటలైనా ఒకరో.. ఇద్దరో.. ఉద్యోగులు వచ్చి సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. వివిధ పనుల నిమిత్తం గ్రామస్థులు ఫోన్‌లో సంప్రదించగా.. కంప్యూటర్లు పనిచేయట్లేదని సమాధానం చెప్పినట్లు బాధితులు వాపోతున్నారు. మరికొంత మంది సిబ్బంది సెలవులో ఉన్నామని చెబుతున్నారట. పంచాయతీ కార్యదర్శి కూడా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. గొడ్డువెలగల కార్యదర్శి బాషాకు గాండ్లపెంట ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మండలకేంద్రంలోని ప్రధాన రహదారిలో ఉన్న సచివాలయానికి తలుపులు తెరచివేసి, సిబ్బంది ఎవరూ లేకపోవడం పట్ల జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విలువైన వస్తువులు పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈవిషయంపై ఎంపీడీఓ రామానాయక్‌ను అడగ్గా.. వెటర్నరీ అసిస్టెంట్ కదిరికి బదిలీ అయ్యారనీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సెలవులో ఉన్నారన్నారు. మిగిలినవారు సెలవులో ఉన్నట్లు తనకు సమాచారం లేదని చెప్పుకొచ్చారు.


సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

వేర్వేరుచోట్ల ఇద్దరి ఆత్మహత్య

● భర్త పట్టించుకోలేదని భార్య
● ప్రియురాలు బ్రేకప్ చెప్పిందని యువకుడు

అనంతపురం క్రైం, మే 16: అనంతపురం నగర పరిధిలో వేర్వేరు కారణాలతో ఓ మహిళ, మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. పాపంపేటకు చెందిన జ్యోతి (28) తన భర్త పట్టించుకోవడం లేదని, కుటుంబ అవసరాలు తీర్చడం లేదని జీవితంపై విరక్తి చెందింది. బుధవారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుంది. ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. నగర శివారులోని ఆదర్శనగర్‌కు చెందిన గౌరీశంకర్ (21) డిగ్రీ చదివాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో అమ్ము పేరుతో ఓ అమ్మాయి పరిచయమైంది. ఆ అమ్మాయితో ప్రేమలో మునిగాడు. రెండు నెలల క్రితం ఆ అమ్మాయి బ్రేకప్ చెప్పింది. దీంతో అప్పటి నుంచి తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. ఇదే క్రమంలో మనస్తాపానికి గురైన గౌరీశంకర్ బుధవారం రాత్రి తన ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించేసరికి అతను చనిపోయాడు. ఈ రెండు ఘటనలపైనా అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నగరంలో ఓ కారు ఢీ కొని ఓ గుర్తు తెలియని వ్యక్తి (58) మరణించాడు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ వ్యక్తి తపోవనం సర్కిల్‌లో రోడ్డును క్రాస్ చేస్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అతను మరణించాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుడిపై వైసీపీ మూకల దాడి

● తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలు

పెనుకొండ రూరల్, మే 16: మండలంలోని మావటూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సంపత్ కిష్టప్పపై అదే ఊరికి చెందిన వైసీపీ వర్గీయులు గురువారం దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. సంపత్‌కిష్టప్ప సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరపున చురుగ్గా ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో మావటూరు వైసీపీ మద్దతు సర్పంచ్ నాగరాజు తమ్ముడు జీజే శేఖర్, నాయకులు మోహన్, చాకలి మారుతి, హరిజన సూర్యనారాయణ.. అతడిపై కక్ష పెంచుకున్నారు. దాడికి పథకం పన్నారు. అందులో భాగంగా సమీపంలోనే ఉన్న కర్ణాటకలోని దొమ్మితిమర్రి గ్రామంలో కాపుకాశారు. మద్యం షాపు వద్ద మద్యం తాగి వేచి ఉన్నారు. సంపత్‌కిష్టప్ప పని నిమిత్తం దొమ్మితిమర్రి గ్రామానికి వెళ్లగా.. మద్యం మత్తులో ఉన్న వైసీపీ వర్గీయులు కర్రలు, రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్ర గాయాలతో అతడు అక్కడే పడిపోయాడు. స్థానికుల సమాచారంతో కుటుంబీకులు అక్కడికి చేరుకుని సంపత్ కిష్టప్పను పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి పావగడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

ఈఏపీసెట్ ప్రారంభం


పరీక్షలు రాసివస్తున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, మే 16: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈఏపీసెట్-2024) పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. 16, 17న అగ్రికల్చర్, ఫార్మసీ, 18 నుంచి 23 వరకు ఇంజనీరింగ్ స్ట్రీమింగ్ పరీక్షలు ఉంటాయి. అనంతపురంలో ఆరు, తాడిపత్రిలో రెండు, గుత్తి, పుట్టపర్తిలో ఒకటి చొప్పున మొత్తం పది కేంద్రాలను ఏర్పాటు చేశారు. రోజు రెండు సెషన్లలో పరీక్షలుంటాయని, ఒక్కో సెషన్‌కు 1600 నుంచి 1800 మంది విద్యార్థులు హాజరవుతారని అధికారులు తెలిపారు.

స్ట్రాంగ్‌రూములను పరిశీలించిన కలెక్టర్


స్ట్రాంగ్‌రూముల పరిశీలనకు వెళ్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, మే 16: జేఎన్‌టీయులోని అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ గురువారం పరిశీలించారు. భద్రతా చర్యలు, డ్యూటీలు గురించి ఆరా తీశారు. భద్రత విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయరాదని, సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ వరకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మద్యం మత్తులో పోలీసుల ఘర్షణ

కళ్యాణదుర్గం రూరల్, మే 16: మద్యం మత్తులో పోలీసులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. పట్టణ సమీపంలోని పంపుహౌస్ వద్ద పట్టణానికి చెందిన ఓ కానిస్టేబుల్ ఇద్దరు స్పెషల్ పార్టీ కానిస్టేబుళ్లు, ఓ జవాన్ నలుగురు మద్యం తాగి మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకుని గాయపరచుకున్నట్లు తెలిసింది. ఈ గొడవను చుట్టుపక్కల వారు వీడియో తీయగా వారి వద్ద నుంచి ఫోటోలు వీడియోలు డిలీట్ చేయించినట్లు సమాచారం.

రాళ్ల దాడులపై కేసు నమోదు

పుట్లూరు, మే16: మండలంలోని ఓబులాపురం గ్రామంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ వర్గాలు రాళ్లదాడుల నేపథ్యంలో ఇరువురి వర్గాలపై కేసునమోదు చేసినట్లు గురువారం ఎస్ఐ హేమాద్రి తెలిపారు. మొత్తం 10మందిపై కేసు నమోదుచేశామన్నారు. టీడీపీ వర్గం నుంచి శ్రీనివాసులునాయుడుతోపాటు మరో ముగ్గురు, వైసీపీ నుంచి రమణతోపాటు మరో ఐదుమందిపై కేసు నమోదుచేశామని తెలిపారు.

అడిగేదెవరు?



● ఏడీసీసీ బ్యాంకులో ఇష్టారాజ్యం
● రుణాలకు లంచాల వసూలు
● ఏకపక్ష నిర్ణయాలతో అస్తవ్యస్తం
● అక్రమార్కులకు కొందరు ఉన్నతాధికారుల అండ



అనంతపురం క్లాక్‌టవర్, మే 16: జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో విచ్చలవిడిగా అవకతవకలు చోటుచేసుకుంటున్నా అడిగే నాథుడే లేడు. నిబంధనలకు విరుద్ధంగా లాకర్‌లు ఓపెన్ చేయడం, సొసైటీలు, బ్యాంకులలో రుణాలు పక్కదారి పట్టించడం, సొంతానికి ఉద్యోగులు వాడుకుంటుండటం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో పరిపాటిగా మారింది. గత నాలుగేళ్లుగా సొసైటీలకు ఎన్నికలు జరగకపోవడం, నామినేటెడ్ కమిటీల నియామకంతో పాలకవర్గం పలచపడిపోయింది. దీంతో ఏడీసీసీ బ్యాంకులో అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఇంత తతంగం జరుగుతున్నా సహకారశాఖ అధికారులు మాత్రం ఏడీసీసీ బ్యాంకువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

ప్రతి పనికీ ఓ రేటు..

ఏడీసీసీ బ్యాంకులో ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయిస్తున్నారు. ఏడాది పొడవున రైతులకు పంట రుణాలు ఇస్తామని అధికారులు ప్రకటించారు. ఇదే అదనుగా చేసుకున్న ఓ ఇద్దరు కీలక అధికారులు రుణం చెల్లించే ప్రతి ఫైల్‌కు ఓ రేటు ఫిక్స్ చేశారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు వేర్వేరుగా చెల్లిస్తారు. ఎకరాకు రూ.40వేలు నుంచి పంట ఆధారంగా రూ.80వేలు వరకు చెల్లిస్తున్నారు. ఎకరాకి 10శాతం చొప్పున ఆ ఇద్దరు అధికారులకు రైతులు ముడుపులు చెల్లిస్తేనే రుణాలు విడుదల చేస్తారు. లేదంటే కుంటి సాకులతో ఆ రైతులను రుణాల కోసం సొసైటీ, బ్యాంకులు, ప్రధాన కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారు. ఇటీవల కళ్యాణదుర్గం పరిధిలో ఓ రైతు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మూడు నెలల పాటు తిరిగిన బాధిత రైతు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండిపోయారు. ఈ క్రమంలో ఆ ఇద్దరు కీలక అధికారులను నేరుగా సంప్రదించి ముడుపులు అందించి రుణం మంజూరు చేయించుకున్నారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే...ప్రతి నిత్యం ఏడీసీసీ బ్యాంకులో ఈ తంతు జరుగుతున్నా ఎవరూ నోరు మెదపకపోవడం ఆ ఇద్దరు అధికారులకు కలిసొస్తున్న అంశం.

లాకర్ తెరిచిన కేసు ఏమైనట్లు...?

ఏడీసీసీ బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న మేనేజర్ సోమశేఖర్ నిబంధనలకు విరుద్ధంగా ఇటీవల లాకర్లు తెరిపించడంపై ఉత్తుత్తి విచారణ జరిపారు. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక అందజేసినా కీలక అధికారి సంబంధిత మేనేజర్ సోమశేఖర్‌పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినవస్తున్నాయి. వజ్రకరూరు సొసైటీలో రూ.20లక్షల వరకు అవినీతి జరిగినట్లు స్వయం అధికారులే తేల్చారు. రైతుల అప్పులకు జమచేయాల్సిన సొమ్మును సొసైటీ సీఈఓ తన సొంతానికి వాడుకున్నారు. ఆధారాలతో నిర్ధారించినా బాధ్యుడైన సీఈఓపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన శాఖలో పనిచేస్తున్న ఓ ఇద్దరు కీలక అధికారులు, వారి కనుసన్నల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కేసు బయటకు పొక్కకుండా కప్పిపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడీసీసీ బ్యాంకు ఉన్నతాధికారులు కొందరు మామూళ్ల మత్తులో తూలుతూ ఇలాంటి అక్రమాలను వెనకేసుకొస్తున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి.

అక్రమార్కులకు అందలం

ఏడీసీసీ బ్యాంకులో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న గోవిందరెడ్డిని గతేడాది ఉద్యోగం నుంచి తొలగించారు. ఒకే భూమికి సంబంధించి రెండు సొసైటీల్లో రుణం తీసుకున్నట్లు విచారణలో నిర్ధారించడంతో ఉద్యోగం నుంచి తీసివేశారు. అయితే ఆరు నెలలు గడవకనే బోర్డుకు అర్జీ పెట్టుకోవడంతో ఆయన్ను తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారు. సాధారణంగా కోర్టు తీర్పునకు లోబడి ఉద్యోగం నుంచి తొలగించిన వ్యక్తిని తిరిగి తీసుకునే ప్రక్రియ జరుగుతుంది. అయితే గోవింద రెడ్డి విషయంలో ఏకపక్షంగా ఉద్యోగం నుంచి తొలగించడం...తిరిగి తీసుకోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటన్నది అంతుబట్టని విషయం. తొలగించిన చోటే హిందూపురం శాఖ సహాయ మేనేజర్‌గా గోవిందరెడ్డిని నియమించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదే శాఖలో పనిచేస్తున్న మేనేజర్ రాఘవేంద్రను అనంతపురంలోని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేయడం...ఇన్‌చార్జి మేనేజర్‌గా గోవిందరెడ్డికి బాధ్యతలు అప్పగించడం పట్ల ముడుపుల బాగోతమేననే చర్చ నడుస్తోంది.

ముగేత్తంపల్లిలో నీటి ఎద్దడి



నార్పల, మే 16: మండలంలోని ముగేత్తంపల్లిలో నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చింది. బిందె నీటి కోసం మహిళలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. గ్రామంలో రెండు బోర్లు ఉండగా ఒక బోరులో నీరు పూర్తిగా అడుగంటింది. మరో బోరులో నీరు కొద్దిగా ఉండటంతో అర గంటకు ఒకసారి బోరు వేస్తూ.. వచ్చిన నీటిని పట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఆ నీటి కోసం బిందెలను క్యూలో పెట్టి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. అవి సరిపోకపోవడంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న పొలాలకు వెళ్లాల్సి వస్తోందని ఆ గ్రామ మహిళల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని... కనీసం తమ గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడడంలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

← నీటి కోసం క్యూలో ఉంచిన బిందెలు

నాణ్యతగా ఉండాలి

అనంతపురం అర్బన్: విత్తన వేరుశనగ నాణ్యతగా ఉండేలా చొరవచూపాలని అనంతపురం ఏడీఏ రవి ఆదేశించారు. గురువారం అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి సమీపంలోని ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆయన తనిఖీ చేశారు. విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించారు. నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలు సేకరించి, నిబంధనలకు లోబడి ప్రాసెసింగ్ చేయాలన్నారు. నాణ్యమైన విత్తన కాయలను మాత్రమే ఆర్బీకేలకు పంపాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు



విత్తన వేరుశనగను పరిశీలిస్తున్న ఏడీఏ

బైక్ స్టాండ్ కాదిది.. ఆస్పత్రిలోకి వెళ్లే దారి

అనంతపురం టౌన్, మే 16: జిల్లా సర్వజన ఆస్పత్రిలో పార్కింగ్ సమస్య అస్తవ్యస్తంగా మారింది. ఎందరు వైద్యాధికారులు వచ్చినా... ఇక్కడ పార్కింగ్ సమస్యను తీర్చే పరిస్థితి కనిపించడంలేదు. గతంలో ఆస్పత్రిలోకి ఎంటర్ అయితేనే ఎడమ వైపు ఖాళీ స్థలంలో వాహనాలకు పార్కింగ్ ఉండేది. ఇక్కడ వాహనాలు పెట్టి వార్డులకు వెళ్లి రోగులు, వారి బంధువులు చికిత్సలు చేయించుకొని వచ్చేవారు. ఆ స్థలంలో బాలింతలకు వార్డు ఏర్పాటు చేయడంతో వాహనాల పార్కింగ్‌కు పెద్దసమస్యగా మారింది. రోజుకు రెండు వేలమంది వరకు రోగులు, వారి బంధువులు ఈ ఆస్పత్రికి వస్తుంటారు. ఇందులో వందలాది మంది వాహనాలలో రోగులను తీసుకొచ్చి చూపించడం.. అడ్మిషన్‌లో ఉన్న రోగులను చూడడానికి వస్తుంటారు. ఆ వాహనాలు ఎక్కడ పెట్టాలో తెలీక వెనక నుంచి వచ్చి ఆస్పత్రిలోకి వెళ్లడానికి ఉన్న రోడ్డులో ఉంచుతున్నారు. దీంతో ఆ రోడ్డు నుంచి లోపలికి వెళ్లాలన్నా... అక్కడ కూర్చొని విశ్రాంతి తీసుకోవాలన్నా రోగులు, ప్రజలు చాలా ఇబ్బందిపడాల్సి వస్తోంది. ఇంకా కొందరు తమ వాహనాలను లోపటికి తీసుకొచ్చి ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేసి పోతున్నారు. ఒక్కోసారి సీరియస్ కేసులు తీసుకొచ్చే 108 వాహనాలు క్యాజువాలిటీలోకి వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సెక్యూరిటీ సిబ్బంది ఉంటున్నా ఏమిచేయలేక చేతులెత్తేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పార్కింగ్ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆస్పత్రి ఆవరణలోని రోడ్డుపై ఉంచిన బైక్‌లు

పీటీసీలో ఫ్రిడ్జ్ ఏర్పాటు

అనంతపురం కల్చరల్, మే 16: పీటీసీ స్టేడియం వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో వాకర్స్ దాహార్తిని తీర్చేందుకు గురువారం పీటీసీలో ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు 1.70 లక్షలు వెచ్చించి పీటీసీలో ఫ్రిడ్జ్ ఏర్పాటు చేయడంతోపాటు ఆడియన్స్ గేలరీ చుట్టూ శుభ్రపరిచేందుకు ప్రత్యేక పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. గురువారం ఆ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు ఆ ఫ్రిడ్జ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పీటీసీ సిబ్బంది రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పవన్, హెడ్‌కానిస్టేబుల్ భూపాల్‌రెడ్డి, కానిస్టేబుల్ నారాయణస్వామి, పీటీసీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమోహన్, ట్రాన్స్‌కో సిబ్బంది రామలింగ, రవీంద్ర, రామాంజనేయులు, మూర్తి, రామిరెడ్డి పాల్గొన్నారు.



ఫ్రిడ్జ్‌ను ప్రారంభిస్తున్న వాకర్స్ సంఘం నాయకులు

టీడీపీ ధీమా... వైసీపీ డీలా

శింగనమల మే 16: శింగనమల నియోజకవర్గంలో ఎన్నికల అనంతరం టీడీపీ నాయకులు విజయ ధీమాతో ఉండగా... వైసీపీ నాయకులు ఓటమి భయంతో డీలా పడ్డారు. వైసీపీపై వ్యతిరేకతతో పాటు.. ఆ పార్టీలోనే విభేదాల కారణంగా టీడీపీ అధిక మెజార్టీతో గెలిచే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతతో యువత, మహిళలు, అదే పార్టీ వారు కసిగా టీడీపీకి ఓటు వేయడంతోనే పోలింగ్ శాతం భారీగా పెరిగిందని అంటున్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బంధువులు చేసిన పనులతో ఆ పార్టీ వారే విసిగిపోయారు. మళ్లీ ఎమ్మెల్యేకు చెందిన వ్యక్తి అయిన వీరాంజినేయలుకు వైసీపీ టికెట్ ఇవ్వడంపై మొదటి నుంచీ ఆ పార్టీలోని మెజార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యతిరేకిస్తూ వచ్చారు. అభ్యర్థిని మార్చాలని అధిష్ఠానాన్ని కోరారు. అయినా ఫలితం లేకపోవడంతో వారంతా టీడీపీకే ఓటేసినట్లు సమాచారం.

హుండీ సొమ్ము లెక్కింపు

ఉరవకొండ, మే 16: మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి సమర్పించిన హుండీ సొమ్మును గురువారం లెక్కించారు. పర్యవేక్షణాధికారి రంగస్వామి నాయుడు, ఈవో విజయ్‌కుమార్ సమక్షంలో హుండీలను తెరచి లెక్కింపు నిర్వహించారు. 127రోజులకు గానూ రూ.22,84,123 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ ఉద్యోగులకు అందని వేతనం

అనంతపురం సెంట్రల్, మే 16: ఎస్కేయూలో సుమారు 800 మంది చిరుద్యోగులు గత నెల జీత అందక ఇబ్బందులు పడుతున్నారు. వర్సిటీ ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంలేదు. ఉన్నతాధికారులు రోజుల పాటు విజయవాడలో తిష్టవేసినా ఫలితం లేకుండా పోయింది. సెక్రెటరీ కార్యాలయంలో ఒక విభాగం నుంచి మరో విభాగానికి ఎస్కేయూ ఫైల్స్‌ను మూవ్ చేయించి వాటిని అప్రూవల్ చేయించారు. అయినా నిధులు మాత్రం మంజూరు కాలేదని వర్సిటీ వర్గాలు వాపోతున్నాయి. జీతాల కోసం రిజిస్ట్రార్, ఫైనాన్స్ కార్యాలయం చుట్టూ తరుగుతున్నామని ఉద్యోగులు మండిపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసినా జీతాలివ్వడంలేదని వాపోతున్నారు. నెలవారి వేతనాలపై ఆధారపడి జీవిస్తున్న తమ పరిస్థితి దయనీయంగా మారిందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫైనాన్స్ ఆఫీసర్ వెంకటరాముడిని దీనిపై వివరణ కోరాగా.. నిధులు జమ కాగానే జీతాలు పడిపోతాయని పేర్కొన్నారు.

సీనియర్ కళాకారుడు బండారు నగేష్ మృతి

నార్పల, మే 16: నార్పలకు చెందిన సీనియర్ కళాకారుడు బండారు నగేష్ (55) అనారోగ్యంతో బుధవారం రాత్రి మరణించారు. ఆయన 30 సంవత్సరాలుగా రాష్ట్రంలో అనేక పౌరాణిక నాటకాలు వేసి మంచి గుర్తింపు పొందారు. పలు అవార్డులు కూడా దక్కాయి. ఆయనకు ఏడాదిగా ఆరోగ్యం బాగాలేదు. దీంతో ఆయన బుధవారం రాత్రి మరణించారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే సూరి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మీనుగా రామాంజనేయులు, మధ్యాహ్నం రాము, హరి, శివానంద, అమ్మలదిన్నే కుళ్లాయప్ప, రామకృష్ణ, పాల్గొన్నారు.



బండారు నగేష్ (ఫైల్)

చీనీ కాయలు టన్ను రూ.36వేలు

అనంతపురంరూరల్, మే 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36,500, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.23 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 811 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఓటు వేయని వారు... 18 వేల మంది

అనంతపురంరూరల్, మే 16: మండలంలో 18 వేల మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. మండలంలో మొత్తం 81,451 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 40,222 మంది.. మహిళలు 41,222 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు. వీరిలో పురుషులు 31,272 మంది.. మహిళలు 31,884 మంది.. మొత్తంగా 63,156 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మరో 18,296 మంది ఓటు వేయలేదు.

డీఎస్పీ చైతన్యను సస్పెండ్ చేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, మే 16 : లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన స్థానంలో ఉంటూ... వైసీపీకి కొమ్ము కాస్తున్న డీఎస్పీ చైతన్యను వెంటనే సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసు నమోదు చేయాలని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి అనంతపురం క్లబ్ సభ్యుడు లక్ష్మన్న ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తాడిపత్రిలో జరిగిన అల్లర్లలో ఏకపక్షంగా వ్యవహరిస్తూ, టీడీపీ నాయకులపై దాడులకు పాల్పడిన అతన్ని సస్పెండ్ చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి ఇంట్లో కంప్యూటర్ ఆపరేటర్, దివ్యాంగుడైన కిరణ్‌పై భౌతికదాడి చేసిన డీఎస్పీని విధుల నుంచి తొలగించి, కేసు నమోదు చేయాలన్నారు.

అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలి

అనంతపురం విద్య, మే 16: జిల్లాలో అనుమతి లేని స్కూళ్లను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నాయకులు ఏడీ క్రిష్ణయ్యను డీఈఓ కార్యాలయంలో కలిశారు. పలు కార్పొరేట్ స్కూళ్లు నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్నాయని, ఒకటి, రెండు బ్రాంచులకు అనుమతి తీసుకుని, ఆరు.. ఏడు బ్రాంచులు నడుపుతున్నారని అన్నారు. పుస్తకాల పేరుతో రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు లాగేస్తున్నారని, ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులను యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయన్నారు. వెంటనే ఒక అధికారిని నియమించి అన్ని స్కూళ్లలో తనిఖీలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే స్కూళ్లను సీజ్ చేయాలని కోరారు. ఈ మేరకు ఏడీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మంజునాథ్, ఉమామహేష్, వంశీ, రారాజు, హర్ష, పవన్ పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయం వద్ద నాయకుల నిరసన

పరిటాల ఇంటికి నేతల క్యూ

అనంతపురం అర్బన్, మే 16: అనంతపురంలోని మాజీ మంత్రి పరిటాల సునీత ఇంటి వద్దకు రాప్తాడు నియోజకవర్గానికి చెందిన నాయకులు క్యూ కట్టారు. పోలింగ్ ముగిసిన నాటి నుంచి ప్రతి రోజు పలు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పరిటాల సునీతను కలిసి ఈ ఎన్నికల్లో గెలుస్తున్నామన్న ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అనంతపురం నగరంలోని ఆమె నివాసానికి రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వచ్చారు. వారితో పరిటాల సునీత సమావేశమైన పలు అంశాలపై చర్చించారు. పోలింగ్ సరళిపై నాయకులతో ఆమె ఆరా తీశారు. పంచాయితీ వారిగా ఎన్ని ఓట్లు పోలయ్యాయి..? ఎంత మెజార్టీ వచ్చే అవకాశం ఉందన్న వివరాలపై చర్చించారు. గ్రామాల్లో అందరూ ఎవరు పనుల్లో వారు ఉండాలని, ఎవరైనా రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా స్పందించకూడదని సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని.. ఆ తర్వాత అందరూ సోదర భావంతో మెలగాల్సిన అవసరం ఉందని పరిటాల సునీత సూచించారు.



పరిటాల సునీతను కలిసిన పాపంపేట నాయకులు



నాయకులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

పాపంపేట టీడీపీ శ్రేణుల భేటీ

అనంతపురంరూరల్ : మండలంలో పాపంపేటకు చెందిన టీడీపీ శ్రేణులు మాజీ మంత్రి పరిటాల సునీతతో స్థానిక అరవిందనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువా రం భేటీ అయ్యారు. పంచాయతీలో జరిగిన ఎన్నికల పోలింగ్ గురించి ఆమె నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగయ్య, పేరం హరిప్రసాద్, రామాంజినేయులు, తాడాల నాగభూషణం, బాబావలి, సాంబశివ, షఫీ, నాగముని, గ్రామకమిటీ అధ్యక్షులు జెట్టి భరత్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి హరీష్‌రెడ్డి, జిల్లా నాయకులు నవీన్, రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు మద్దినేని కృష్ణ పాల్గొన్నారు.

కబడ్డీ వేసవి శిక్షణ ప్రారంభం



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న దాత, డీఎస్‌డీఓ

అనంతపురం క్లాక్‌టవర్, మే 16: కబడ్డీ వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఉదయం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో ప్రారంభించారు. ఆ క్రీడాకారులకు ఎస్ఆర్ఎం బిల్డర్స్ సంస్థ అధినేత శివ రామాంజుల రెడ్డి, నవీన్‌రెడ్డి దుస్తులు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. దాతలకు డీఎస్‌డీఓ షఫీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు అనీల్‌కుమార్, జెబీవుల్లా, క్రీడాకారులు పాల్గొన్నారు.

పెన్షనర్లనూ వదలని ప్రభుత్వం

- ఐదేళ్లలో విడతల వారీగా పథకాలు రద్దు
- అలవెన్సుల విషయంలోనూ అన్యాయమే
- ఈహెచ్‌ఎస్‌ను పత్తాలేకుండా చేసిన వైనం
- దహనసంస్కారాలకు అందని సాయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 16: ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలను నట్టేట ముంచింది. ఆఖరికి ప్రభుత్వ పెన్షనర్లనూ రాష్ట్ర ప్రభుత్వం వదలిపెట్టలేదు. వారి కందించాల్సిన అలవెన్సులను పెండింగ్.. సంక్షేమ పథకాలను అటకెక్కించి వారిని మానసికంగా ఇబ్బందులకు గురిచేసింది.

క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ తగ్గింపుతో అన్యాయం..

క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌తో ప్రభుత్వ పెన్షనర్లు ఐదేళ్లకోసారి తమ పెన్షన్‌ను బట్టి 10 శాతం నగదును పొందేవారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 70 ఏళ్ల వయస్సున్న వారికి 10 శాతం 75 ఏళ్ల వారికి 15 శాతం, 80 ఏళ్ల వారికి 20, 85 ఏళ్ల వారికి 25, 90 ఏళ్ల వారికి 30, 95 ఏళ్లవారికి 40, 100 ఏళ్లు ఉన్న వారికి 45 శాతం చొప్పున క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను అందించేంది. అయితే క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పేరుతో ఐదేళ్లకోసారి అందించే ఆ కొద్దోగొప్పో నగదును సైతం వైసీపీ ప్రభుత్వం లాగేసుకుంది. క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ శాతాన్ని తగ్గిస్తూ పెన్షనర్లకు అన్యాయం చేసింది. 70 ఏళ్ల వయస్సున్న వారికి 10 శాతం నుంచి 7 శాతానికి, 75 ఏళ్ల వయస్సున్న వారికి 15 నుంచి 12, 80 ఏళ్ల వయస్సున్న వారికి 20 నుంచి 17 ఇలా మూడు శాతం చొప్పున కోత విధించింది.



పత్తాలేని ఈహెచ్‌ఎస్...

జిల్లా వ్యాప్తంగా గెజిటెడ్, నాన్ గెజిటెడ్ పెన్షనర్లు సుమారు రూ. 25 వేలకుపైగా ఉన్నారు. ఈహెచ్‌ఎస్‌కు సంబం ధించిన నగదును సంబంధిత ఆస్పత్రులకు వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో ఆయా ఆస్పత్రులు ఈహెచ్‌ఎస్‌ను అమలు చేయలేమని చేతులెత్తేశాయి. దీంతో ఐదేళ్లుగా పెన్షనర్లు తమ సొంత ఖర్చులతో వైద్యం చేయించుకుంటున్నట్లు వాపోతున్నారు.

డీఆర్ కోసం తప్పని ఎదురుచూపులు....

సాధారణంగా సర్వీసులో ఉండే ఉద్యోగులకు డీఏలు ప్రభుత్వాలు అందిస్తాయి. అయితే విధంగా ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లకు డీఆర్ (డియర్‌నెస్ అలవెన్స్)లు అందిస్తారు. అయితే 1.7.2018 నుంచి ఇప్పటి వరకూ డీఆర్‌లు, అరియర్స్ రాష్ట్ర ప్రభుత్వం జమ చేయలేదు. దీనివల్ల ఐదేళ్లుగా పెన్షనర్లు డీఆర్, అరియర్స్‌ను భారీస్థాయిలో కోల్పోయారు. ఇక పీఆర్సీ అనే పదాన్నే తాము మరిచినట్లు పలువురు పెన్షనర్లు వాపోతున్నారు.

దహన సంస్కారాలకు అందని సాయం....

పెన్షనర్లు ఎవరైనా మరణిస్తే... జీవిత భాగస్వామికి తక్షణ దహన సంస్కారాల కింద రూ. 10నుంచి రూ. 15 వేలు అందించేది. రూ. 50 వేలలోపు పెన్షన్ తీసుకునే పెన్షనర్లకు రూ. 10 వేలు, ఆపై పెన్షన్ తీసుకునే వారికి రూ. 15 వేలు దహన సంస్కారాలకు ప్రభుత్వం సాయమందించేది. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ పథకానికి మంగళం పాడి ఆ వర్గాలకు దహన సంస్కారాల సాయాన్ని అందించకుండా అన్యాయం చేసింది. .

పెన్షనర్ల ఉసురు తప్పదు...

వైసీపీ ఐదేళ్ల పాపానికి మూల్యం చెల్లించు కోకతప్పదు. ఐదేళ్లల్లో పెన్షనర్లు ఎంత ఆవేదన చెందారో... ఎంత బాధ పడ్డారో కళ్లారా చూశాం. కనీసం మాకు అమలయ్యే పథకా లను సైతం అమలు చేయకుండా అన్యాయం చేసింది. డీఆర్, అరియర్స్‌ను ఐదేళ్లుగా అందించకపోవడం బాధాక రం. చనిపోయినప్పుడు అందించే దహన సంస్కారాల సాయం కూడా అందించలేదంటే ప్రభుత్వానికి పెన్షనర్ల పట్ల ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. వారి బాధ... ఆవేదన... ఉసురు రూపంలో తగలక తప్పదు.



-పెద్దనగౌడ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఆంధ్రా పెన్షనర్ పార్టీ

ఏపీఎల్‌లో అనంత వరుస విజయాలు



ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి బహుమతి అందజేస్తున్న రంజీ మాజీ క్రీడాకారుడు సురేష్

అనంతపురం క్లాక్‌టవర్, మే 16: అనంతపురం ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2 పోటీల్లో అనంత రైజింగ్ స్టార్ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఏపీఎల్-2 క్రికెట్ పోటీలు మూడో రోజైన గురువారమూ కొనసాగాయి. అనంత రైజింగ్ స్టార్స్, ఫ్యామిలీ క్రికెట్ క్లబ్ జట్లు తలపడగా.. మొదట బ్యాటింగ్ చేసిన అనంత రైజింగ్ స్టార్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఫ్యామిలీ క్లబ్ 14.2 ఓవర్లలో 83 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంత రైజింగ్ స్టార్ బ్యాటర్ ప్రశాంత్ 57 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. దీంతో అనంత రైజింగ్ స్టార్ 71 పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో దినేష్ గ్రానైట్స్ జట్టు, ఇండియన్ సిక్సర్స్ జట్టు మధ్య జరగగా... మొదట బ్యాటింగ్ చేసిన ఇండియన్ సిక్సర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లుకు 191 పరుగులు సాధించింది. ఇందులో ప్రవీణ్‌కుమార్ రెడ్డి 67 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన దినేష్ గ్రానైట్స్ 16.3ఓవర్లలో 114 పరుగులు మాత్రమే చేసి ఇండియన్ సిక్సర్స్ బౌలర్ల ధాటికి కుప్పకూలింది. ఈ కార్యక్రమంలో మాజీ రంజీ ప్లేయర్ సురేష్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోశాధికారి షబ్బీర్ అహ్మద్, సహాయ కార్యదర్శి భీమలింగారెడ్డి, సీనియర్ క్రీడాకారులు సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

అనంతపురం కల్చరల్, మే 16: ఓ అనాథ హిందూ వ్యక్తికి ఇండియన్ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ (ఐఎంఎం) నాయకులు అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్కేయూ సమీపంలో నివాసముండే సత్యనారాయణ (56)కు రక్త సంబంధీకులు లెవరూ లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మరణిం చాడు. అంతిమ సంస్కారాలు నిర్వహించేవారెవరూ లేకపోవడంతో మాజీ కార్పొరేటర్ పావురాల చంద్రశేఖర్ ఐఎంఎం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మహబూబ్‌బాషాకు విషయం తెలిపారు. దీంతో ఆ నాయకులు సత్యనారాయణకు హిందూ సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, దాదు, బాషా, బషీర్, నూర్ పాల్గొన్నారు.



సత్యనారాయణ పాడె మోస్తున్న ఐఎంఎం నాయకులు

దివ్యాంగ విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ

అనంతపురం కల్చరల్, మే 16 : స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని దివ్యాంగుల బాలుర వసతి గృహంలో ఉంటున్న మహంతేష్, రమేష్, వెంకటాద్రినాయుడు, ఎర్రిస్వామి గ్రూప్-2 ప్రిలిమ్స్ పాస్ అయి, మెయిన్స్ కోసం ప్రిపేర్ అవుతున్నారు. గురువారం ఆ విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, నిత్యావసర సరుకులు, మెటీరియల్‌తో పాటు వారి పరీక్ష ఫీజును నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి అందజేశారు. కార్యక్రమంలో వసతిగృహం వార్డెన్ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న నిర్మలా మురళి

రేపు వాసవీమాత జయంతి



నగర సంకీర్తన నిర్వహిస్తున్న వాసవీమాత భజన మండలి సభ్యులు

అనంతపురం కల్చరల్, మే 16: వాసవీ జయంతిని పురస్కరిం చుకుని శనివారం పాతూరు అమ్మవారి శాలలో భారీ ఎత్తున వేడుకలు నిర్వహిస్తున్నా మని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వాసవీ భజనమండలి గౌరవాధ్యక్షుడు పార్థం సత్యనారాయణ కోరారు. వాసవీ జయంతి నేపథ్యంలో మంగళవారం నుంచి నిర్వహిస్తున్న నగర సంకీర్తన మూడో రోజున గురువారమూ కొనసాగింది. వాసవీమాత చిత్రపటంతో పురవీధుల్లో తిరుగుతూ, అమ్మవారి భక్తిగీతాలాపనలు చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గర్జాల నాగరాజు, భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

పాపంపేటలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రారంభం

అనంతపురంరూరల్, మే 16: మండలంలోని కళ్యాణదుర్గం రోడ్డు పాపంపేటలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకును గురువారం ప్రారంభించారు. హుండాయ్ ట్రాన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డీజీఎం హెచ్‌టీడీ ఫైనాన్స్ టీఆర్ రామకృష్ణ దీన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ గౌతమ్ కర్ణాటకం, క్లస్టర్ హెడ్ తారకరామారావు పాల్గొన్నారు.

ఎండుతున్న అరటి తోటలు



ఎండిపోయిన అరటిపంట

యల్లనూరు, మే 16: వర్షం జాడ లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి అరటితోటలు ఎండిపోతున్నాయి. మండలంలో అరటిసాగు సుమారు వెయ్యి ఎకరాలకు పైగా సాగులో ఉంది. ఈ పంటను జనవరి నుంచి సాగుచేశారు. గత ఏడాది వర్షాలు తక్కువ కావడంతో భూగర్భజలాలు తగ్గిపోయాయి. దీంతో కూచివారిపల్లి, బొప్పేపల్లి, వాసాపురం గ్రామాల్లో సాగుచేసిన అరటి పంట నీరు అందక ఎండిపోతోంది.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

రాయదుర్గంరూరల్, మే 16: రాయదుర్గం నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీన ఉదయం 5 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. పెద్దలకు రూ. 1950, పిల్లలకు రూ.1020గా ధరను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొనన్నారు. ఆర్టీసీ రవాణా సౌకర్యానికి సంబంధించిన సమస్యలు, సూచనలు, సలహాలు 9959225863 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

మండలానికి విత్తన వేరుశనగ కాయలు



వేరుశనగ కాయలను చూపుతున్న అధికారులు

కూడేరు, మే 16: ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వేరుశనగకాయలు మండలానికి చేరాయి. సబ్సిడీతో వేరుశనగకాయలను రైతులకు పంపిణీ చేయడానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. కూడేరు, ఉదిరిపికొండ రైతు భరోసా కేంద్రాల్లో విత్తనకాయలు నిల్వ చేస్తున్నట్లు ఏఓ విజయ్‌కుమార్ తెలిపారు. విత్తనకాయలు కావాల్సిన రైతులు తమ పేర్లను ఆర్బీకేలో నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఎలుగుబంటి హల్‌చల్



పొలాల్లో ఎలుగుబంటి

కళ్యాణదుర్గంరూరల్, మే 16: శెట్టూరు మండలం కైరేవు గ్రామంలో ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. ఇద్దరు రైతులపై దాడి చేసినట్లు స్థానిక రైతులు తెలిపారు. పొలాల్లోకి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ముందస్తు నోటీసులు

యల్లనూరు, మే 16: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కౌంటింగ్‌కు ముందుగా ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు పోలీసులు గురువారం ముగ్గురికి హెచ్చరికలతో కూడిన నోటీసులను అందజేశారు. నోటీసులు అందుకున్న వారిలో జడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి, వాసాపురం నరేంద్ర నాయుడు, నిట్టూరు రవికుమార్ ఉన్నారు. వీరిని స్టేషన్‌కు పిలిపించి సంతకాలు చేయించుకొని హెచ్చరించినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

హజ్ యాత్రపై అవగాహన

గుంతకల్లుటౌన్, మే 16: పట్టణంలోని అంజుమన్ వీధిలోని అంజుమన్-ఏ-ఇస్లామీయా కార్యాలయంలో గురువారం హజ్ యాత్రపై అవగాహన కల్పించారు. హీఫిజులు ఖలీలుల్ రహిమాన్, ఇస్మాయిల్, మన్సన్‌సాబ్ హజ్ ఆచరణ, ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్-ఏ-ఇస్లామీయా అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, గౌరవ అధ్యక్షుడు హాజీ టీఎస్ అబ్దుల్ రహిమాన్, సహాయ కార్యదర్శి అబ్దుల్ వహబ్, సభ్యులు ఆర్టీజీ బాష, అఫ్రోజ్‌ఖాన్, షాషావలి, ఆష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ వేసవి శిక్షణ ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, మే 16: కబడ్డీ వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఉదయం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో ప్రారంభించారు. ఆ క్రీడాకారులకు ఎస్ఆర్ఎం బిల్డర్స్ సంస్థ అధినేత శివ రామాంజుల రెడ్డి, నవీన్‌రెడ్డి దుస్తులు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. దాతలకు డీఎస్‌డీఓ షఫీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు అనీల్‌కుమార్, జబీవుల్లా, క్రీడాకారులు పాల్గొన్నారు.

గెలుపు లెక్కలపై నేతల సమీక్ష

విజయంపై ఎవరి ధీమా వారిదే..



కళ్యాణదుర్గం, మే 16: పోలింగ్ ముగిసింది. ఫలితం ఈవీఎం మిషన్లో నిక్షిప్తమైంది. ఫలితానికి 18 రోజులు నిరీక్షించాలి. నేతలంతా 56 రోజులపాటు తీరిక లేకుండా గడిపారు. వ్యూహాలు, ప్రతి వ్యూహాలు పన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కూటమి, వైసీపీ, కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఓటింగ్ ప్రక్రియ ముగియడంతో గెలుపుపై ఆరా తీస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా లెక్కలు వేస్తున్నారు. పోలింగ్ ఎలా జరిగింది..? ఏ వర్గం వారు ఎటు వైపు ఉన్నారు..? తదితర విషయాలపై చర్చిస్తున్నారు.

రూ. కోట్లలో ఖర్చు..

టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య ప్రధాన పోటీ జరిగింది. ఎన్నికల్లో ఖర్చుకు ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు. సభలను విజయవంతం చేసేందుకు అభ్యర్థులు రూ. కోట్లల్లో ఖర్చు చేశారు. ప్రచారానికి, డీజే, టెంట్ తదితరాలకు భారీగానే ఖర్చుచేశారు. సోషల్ మీడియాలో ప్రచారానికి ప్రత్యేకంగా కొందరిని నియమించి అవి మరీ వైరల్ అయ్యేలా పావులు కదిపారు. ఎన్నికల ముందు రెండు రోజులపాటు ఓటుకు రూ. రెండు వేలు నుంచి రూ. 2500ల వరకు పంపిణీ చేసినట్లు సమాచారం. వైసీపీ నేతలు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది.

ఆకట్టుకున్న సూపర్‌సిక్స్

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ మాత్రం అభివృద్ధి జరగలేదని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈసారి అభివృద్ధి దిశగా ఓటర్లు ముందుకు కదలినట్లు తెలుస్తోంది. ల్యాండ్ టైటిలింగ్‌పై ప్రజల్లో అసంతృప్తి, భయాందోళన కూడా ఓటింగ్ పెరగడానికి కారణమైంది. గత ఐదేళ్లలో రైతులకు బిందుసేద్యం పరికరాలు ఇవ్వకపోగా తప్పుల తడకగా భూసర్వేలు చేయడంలో పలువురు రైతులు అసంతృప్తితో వున్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో రైతులు తమ విలువైన భూములను కోల్పోవాల్సి వచ్చిందని, ఆ భూసర్వేతోనే తీవ్ర ఆందోళనతో వుంటే ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరిట మరో దారుణమైన చట్టాన్ని తెరపైకి తెచ్చారని అంతా భగ్గుమంటున్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని ఇవ్వకపోవడం, మెగా డీఎస్సీ ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు వారి అసహనాన్ని ఎన్నికల్లో ప్రదర్శించారన్నారు. అన్ని వర్గాలను సంతృప్తి పరిచే విధంగా వున్న టీడీపీ మేనిఫెస్టోపై ఎక్కువమంది మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

కూటమి నేతల్లో పెరిగిన జోష్

2014, 2019 ఎన్నికలతో పోలిస్తే 2024 ఎన్నికల్లో ఎక్కువశాతం మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో కూటమి నేతల్లో జోష్ పెరిగింది. జిల్లాలో కళ్యాణదుర్గం నియోజకవర్గం 89.69 శాతం ఓటింగ్ జరిగి రెండవ స్థానాన్ని దక్కించుకుంది. ప్రభుత్వ వ్యతిరేకతతో ఎక్కువ మంది ఓటింగ్‌కు తరలివచ్చినట్లు తెలుస్తోంది. ఇది తమకు లాభం చేకూర్చే అంశమని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి కళ్యాణదుర్గంలో కూటమి గెలుపు దిశగా అడుగులు వేస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు నిశ్శబ్ద తీర్పు ఇవ్వబోతున్నారని, జూన్ 4న అనూహ్య ఫలితాలు చూస్తామని చెబుతున్నారు. మరోవైపు వైసీపీ నేతలు పెరిగిన ఓటింగ్ శాతం ప్రభుత్వ అనుకూలతకు తార్కాణమని అంటున్నారు. ఎవరి అంచనాలు నిజమవుతాయో తెలియాలంటే జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

'అనుమతి లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తే చర్యలు'



క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

రాయదుర్గంరూరల్, మే 16: పట్టణంలో అధికారులు అనుమతులు లేకుండా ప్రైవేట్ క్లీనిక్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్ఓ ఈబీ దేవి అన్నారు. గురువారం పట్టణంలో బళ్లారిరోడ్డులో నిర్వహిస్తున్న క్లీనిక్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఐదు ప్రైవేట్ ఆర్ఎంపీ క్లీనిక్‌లకు నోటీసులు జారీ చేశామన్నారు. మూడురోజుల్లోగా అనుమతికి సంబంధించిన యోగ్యతాపత్రాలు సమర్పించకపోతే సీజ్ చేస్తామని వెల్లడించారు. రోగులతో చెలగాటమాడితే ఎవ్వరినీ ఉపేక్షించేది లేదన్నారు. అధికారుల అనుమతులు లేకుండా క్లీనిక్‌లు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి ఉమాపతి, డాక్టర్ రమేష్, రాజేంద్రప్రసాద్, ఆరోగ్య, వైద్య నిపుణులు లక్ష్మీనారాయణ, గంగాధర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులు దారుణం'



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తాడిపత్రిటౌన్, మే 16: సీపీఐ జిల్లా కార్యదర్శి అక్రమ అరెస్ట్ దారుణమని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీటీ రామాంజనేయులు, మండల కార్యదర్శి నాగరంగయ్య అన్నారు. స్థానిక సీపీఐ నాయకులు రంగయ్య నివాసంలో గురువారం వారు మాట్లాడుతూ తమ పార్టీనేత రంగయ్యకు కాలువిరిగి విశ్రాంతి తీసుకుంటున్నారన్నారు. ఆయనను పరామర్శించడానికి వస్తున్న జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డిలను అక్రమంగా అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముందుగా తాడిపత్రిలో జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్‌చేశారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

రాయదుర్గంరూరల్, మే 16: పట్టణంలోని ఏపీఎన్‌జీఓ భవనంలో శనివారం ఉచిత మూర్ఛవ్యాధి శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు న్యూరో ఫిజీషియన్ వైద్యులు గోపాలం శివనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎన్‌జీఓ భవనంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత మూర్ఛవ్యాధి శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చికిత్స అనంతరం రెండునెలలకు అవసరమైన మందులను రూ. 300లకే అందిస్తున్నట్లు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉరవకొండ: గుత్తి, గుంతకల్లు ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈచంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉరవకొండ, విడపనకల్లు కణేకల్లు మండలాల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

గుత్తిరూరల్, మే 16: మండలంలోని అనగానిదొడ్డి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి, విశ్వనాథ గ్రామశివారులోని గొర్రెల మంద వద్ద సురేంద్రతో ఘర్షణ పడ్డారు. ఘర్షణలో సురేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కుందుర్పి, మే 16: మండల పరిధిలోని కరిగానపల్లి గ్రామంలో వివేకానంద స్ఫూర్తి కేంద్రం ద్వారా పదవతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు గురువారం ప్రోత్సాహకాలు అందించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు తిప్పేస్వామి, వివేకానంద స్ఫూర్తి కేంద్రం సభ్యులు నగదుతోపాటు షీల్డులను అందజేశారు. ఏ గ్రూపులో చేరితే రాణించవచ్చు అన్న అంశంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జేఎల్ చిక్కబొమ్మప్ప, ఎస్‌జీ టీచర్ నింగప్ప, లక్ష్మణమూర్తి, చిత్తయ్య, బొమ్మలింగప్ప, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

డెంగీ, చికున్‌గున్యాపై అవగాహన





ఉద్దేహాళ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, కళ్యాణదుర్గం పట్టణంలో మానవహారం

డెంగీ, చికున్‌గున్యాలపై పలు ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వాటి లక్షణాలను వివరించారు. ఎవరికైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని కోరారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. దోమలను నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

తేలుస్తారా..? మడతపెట్టేస్తారా....!

రూర్బన్ పథకంలో అవినీతిని తేల్చడంతో అధికారులు విఫలం

కళ్యాణదుర్గం, మే 16 : అధ్వాన్న రహదారులు, ఇళ్ల ముందు నిత్యం మురుగు ప్రవాహం, మౌలిక వసతుల కరువు. ఇది కంబదూరు మండల పరిస్థితి. అభివృద్ధి అంటే ఎరుగని ఈ మండలం గ్రామీణ, పట్టణీకరణ కింద శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకం కింద ఎంపికైంది. దీని ప్రకారం రూ. 127 కోట్లతో కంబదూరు మండలంలోని 12 పంచాయతీల్లో అన్ని అభివృద్ధి పనులు మూడేళ్లలో పూర్తి చేయాలి. అయితే ఏడేళ్లు పూర్తయినా మండలం అభివృద్ధికి నోచుకోలేదు. ఆ పథకం నాయకులకు, అధికారులకు వరంగా, అభివృద్ధికి శాపంగా మారింది. కంబదూరు రూర్బన్ పథకంలో జరిగిన అవినీతిని తేల్చడంలో మండల పరిషత్, సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. చేసిన పనులకు కొలతలు లేవు. దాచిపెట్టిన రికార్డులు వెలుగు చూడలేదు. పాత పనులను కొత్తగా చూపారు. నిర్మించిన భవనాలకు లెక్కలు లేవు. మండలంలో చేపట్టిన రూర్బన్ మిషన్ పనులకు సంబంధించి రికార్డులు ఏ మాత్రం లేనట్లు 2021 అక్టోబరులో చేసిన సామాజిక తనిఖీల్లో తేలింది. అప్పటికే సుమారు రూ. 21 కోట్ల వరకు రికార్డులను దాచిపెట్టి ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై అవినీతికి తెరలేపినట్లు విమర్శలు గుప్పుమన్నాయి. ఇలా గత కొన్ని రోజుల నుంచి రూర్బన్ అక్రమాలపై ఫిర్యాదులు, సామాజిక తనిఖీ బృందాలు తేల్చిన అవినీతిపై జిల్లా యంత్రాంగం ముగ్గురు సభ్యులతో తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేసింది. నిర్ధేశిత సమయంలోగా నివేదిక సమర్పించాలని గడువు విధించింది. అయితే ఈ బృందం రోజూ రావడం, రెండు మూడు రికార్డులు ముందరేసుకుని వెళ్లిపోవడం.. ఇదే తంతు కొనసాగుతోంది. కోట్ల పనుల్లో పలు చోట్ల పనులు లేకపోవడం, రికార్డులు కనిపించకపోవడంతో షరామామాలై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రూర్బన్ పనులు ప్రారంభమైనప్పటి నుంచి కోట్ల అవినీతిపై ఆరోపణలు వస్తూనే ఉన్నా ఏ అధికారిపై చర్యలు తీసుకోకపోగా ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదంటే జిల్లా యంత్రాంగం ఎంత ఉదాసీనంగా వ్యవహరిస్తుందో అర్థం చేసుకోవచ్చునని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పథకం లక్ష్యమిదే...!

కంబదూరులో రూ. 127 కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధుల కొరతతో అభివృద్ధి పనులు నత్తనడకన సాగాయి. ఈ పథకంలో రూ. 5 లక్షల విలువకు లోబడిన పనులను నామినేటెడ్ పద్ధతిన అప్పగించారు. వాటికి టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. మొదట్లో పనులు పూర్తయిన వెంటనే సంబంధిత ఇంజనీర్ ధృవీకరించి ఎంబుక్ రికార్డు చేశాక మండల స్థాయిలో ఎంపీడీవో ద్వారా బిల్లుల చెల్లింపులు జరగాలి. ఆ నిధులు ఎంపీడీవో ఖాతాలో వుండేవి. దీంతో పనులు పథకం ప్రారంభమైన కొన్ని రోజుల తరువాత జోరుగా సాగేవి. బిల్లులను సీఎంఎఫ్ఎస్ విధానంలోకి మార్చగా నిధులను పూర్తిగా వినియోగించుకోలేక పోయారు.



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్‌ఫోటో)

'విద్యార్థులు మొబైల్ వాడకాన్ని తగ్గించాలి'

గుత్తి, మే 16: విద్యార్థులు మొబైల్ వాడకాన్ని తగ్గించి విద్య పట్ల శ్రద్ధ ఉంచితే ఉన్నత స్థాయిలో రాణించగలరని ఐసీడీఎస్ ఏసీడీపీఓ నాగమణి సూచించారు. స్థానిక తాడిపత్రి రోడ్డులోని హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో గురువారం చిల్డ్రన్స్ ఆఫ్ఇండియా ఫౌండేషన్, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్ వాడకం, పోక్సో చట్టంపై అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో విద్యార్థులు సెల్‌ఫోన్ల వాడకం అధికమైందన్నారు. ఇది అనర్థాలకు దారితీస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ సీఈఓ నారాయణస్వామి, ఉపాధ్యాయురాలు విశాల పాల్గొన్నారు.

సొంత ప్రాంతాలకు తరలుతున్న పోలీసులు

తాడిపత్రిటౌన్, మే16: తాడిపత్రిలో శాంతిభద్రతలు అదుపులోకి రావడంతో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు బలగాలు సొంత ప్రాంతాలకు వెళుతున్నాయి. రాళ్లదాడులను అరికట్టడానికి కడప, కర్నూలు జిల్లాల నుంచి వచ్చిన డీఐజీ, ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు అందరూ తిరుగుముఖం పట్టారు. పట్టణంలో ముఖ్యమైన ప్రాంతాల్లో మాత్రం పోలీసుసిబ్బందిని కొనసాగిస్తున్నారు.

'ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి'

కళ్యాణదుర్గంరూరల్, మే 16: కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమంతరాయుడు అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయం ముందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అధిక సంఖ్యలో అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. పేద విద్యార్థులతో ఫీజుల దోపిడీ చేస్తున్నా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ తాలూకా ఉపాధ్యక్షుడు నవీన్, పట్టణ నాయకులు సింహాద్రి, హర్ష, బన్నీ పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల్లో జరుగుతున్న ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని యాజమాన్యాలు నిర్వీర్యం చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

సిబ్బంది సమయపాలన పాటించాల్సిందే

- ఎన్‌హెచ్ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి రవిశంకర్

యాడికి, మే 16: ఆరోగ్యసిబ్బంది సమయపాలన పాటించాల్సిందేనని నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం జిల్లా అధికారి రవిశంకర్ ఆదేశించారు. గురువారం రాయలచెరువు, యాడికి ప్రభుత్వ వైద్యశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మందుల నిల్వలపై సిబ్బందిని విచారించారు. సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యసిబ్బంది అంతా సమయపాలన పాటించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్లు దేవరాజన్, శ్రీరాంకుమార్ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

అనంతపురం కల్చరల్, మే 16: ఓ అనాథ హిందూ వ్యక్తి కి ఇండియన్ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ (ఐఎంఎం) నాయకులు అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్కేయూ సమీపంలో నివాసముండే సత్యనారాయణ (56)కు రక్త సంబంధీకులు లెవరూ లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మరణించాడు. అంతిమ సంస్కారాలు నిర్వహించేవారెవరూ లేకపోవడంతో మాజీ కార్పొరేటర్ పావురాల చంద్రశేఖర్ ఐఎంఎం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మహబూబ్‌బాషాకు విషయం తెలిపారు. దీంతో ఆ నాయకులు సత్యనారాయణకు హిందూ సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

హుండీ సొమ్ము లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సభ్యులు

ఉరవకొండ, మే 16: మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి సమర్పించిన హుండీ సొమ్మును గురువారం లెక్కించారు. పర్యవేక్షణాధికారి రంగస్వామి నాయుడు, ఈవో విజయ్‌కుమార్ సమక్షంలో హుండీలను తెరచి లెక్కింపు నిర్వహించారు. 127రోజులకు గానూ రూ.22,84,123 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'కాలవ విజయం తథ్యం'

బొమ్మనహాళ్, మే 16: కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు విజయం తథ్యమని తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే భారీ ఓటింగ్ నమోదైందన్నారు. తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లు భారీగా తరలివచ్చారన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు ఎర్రగుంట్ల వెంకటేశులు, టీడీపీ నాయకులు ముల్లంగి నారాయణస్వామి, మహేంద్ర, మల్లీడు శీన, పయ్యావుల అనిల్, పయ్యావుల మోహన్, పయ్యావుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'శాంతిభద్రతలపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి'

రాయదుర్గంరూరల్, మే 16: రాష్ట్రంలో ఎన్నికల అనంతరం అనంతపురం, పల్నాడు, రాయలసీమ జిల్లాల్లో జరుగుతున్న దాడులపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా కన్వీనర్ వెంకటరమణబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచర్లలోని రెంటాల, చంద్రగిరి, తాడిపత్రి, జమ్మలమడుగు, పలస మండలం అమలపుడియ తదితర ప్రాంతాలలో దాడులు సరైంది కాదన్నారు. వెంటనే గవర్నర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

పొంచివున్న ప్రమాదం



కేబీప్యాలెస్ వద్ద విద్యుత్ స్తంభంలో నిప్పురవ్వలు

రాయదుర్గంరూరల్, మే 16: పట్టణంలోని కేబీప్యాలెస్ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్‌స్తంభంలో నిప్పురవ్వలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రతి రోజూ రహదారిపై వందలాది ద్విచక్రవాహనాలు, వాహనాలు ప్రయాణిస్తున్న సందర్భంలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంలో నిప్పురవ్వలు చెలరేగడంతో భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.